పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్



కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండాలి

● కిశోర వికాసంపై జిల్లా స్థాయి శిక్షణలో కలెక్టర్

కడప కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు మానసికంగా, శారీరకంగా పరిపూర్ణ మహిళగా అభివృద్ధి చెందితే ఆరోగ్యకరమైన భావితరాన్ని, సమాజానికి అందివ్వగలవమని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సభాభవన్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర వికాసంపై జిల్లాస్థాయి శిక్షణలో కలెక్టర్ మాట్లాడుతూ బాలిక దశ నుంచీ మహిళగా పరిణితి చెందే దశను కిశోర బాలికలుగా పరిగణిస్తారన్నారు. ఈ వయస్సుల్లో బాలికలు శారీరక, మానసిక, సామాజికంగా అనేక మార్పులను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. టీనేజ్ బాలికలపై చుట్టుపక్కల వారి ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. తల్లిదండ్రుల నుంచి వారు స్వతంత్రులుగా ఎదిగే వయస్సు కావడం, టీనేజ్ బాలికలు మానసికంగా కొంత అలజడి నెలకొని ఉంటుందన్నారు. గ్రామ స్థాయిలో చేరువలో ఉన్న మహిళా పోలీసు, ఐసీడీఎస్ శాఖకు సంబంధించిన కౌన్సిలర్లు కిశోర బాలికలను గుర్తించి తల్లిండ్రుల సమక్షంలో వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసి బాలికలతో స్నేహ పూర్వకంగా ఉంటూనే వారి శారీరక, మానసిక స్థితి గతులపై ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉన్న 23,000 మంది కిశోర బాలికలను గుర్తించామన్నారు. వీరికి అవగాహన కల్పించే క్రమంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు, చిన్నపిల్లలపై వేధింపులు, బాల్య వివాహాలు, అఘాయిత్యాలు, నేరాలను అరికట్టే దిశగా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ అన్ని జూనియర్ డిగ్రీ కళాశాలలు, ఆపై విద్యాసంస్థల్లో కిశోర వికాసంపై అవగాహన చేపట్టాలన్నారు. కార్యక్రమం లో జడ్పీ సీఈఓ ఓబులమ్మ, ఆర్డీడీ రోహిణి, జిల్లా అధికారులు ఆనంద్ నాయక్, సురేశ్‌రెడ్డి, సరస్వతి, ఎన్జీఓ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయాలది కీలకపాత్ర

● ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

కడప కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషించాయని ఇంటర్మీడియట్ విద్యామండలి పూర్వ సంయుక్త కార్యదర్శి అలపర్తి పిచ్చయ్య చౌదరి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వారం రోజులుగా విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. చివరి రోజు బుధవారం స్థానిక సీపీబ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వీరికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను చైతన్యం చేయడానికి గాడిచర్ల హరిసర్వోత్తమరావు, వావిలాల గోపాలకృష్ణయ్య, అయ్యంకి వెంకటరమణయ్య ఎంతగానో కృషిచేశారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి యు. మీనాక్షి మాట్లాడుతూ పిల్లలకు మొబైల్స్ కాకుండా పుస్తక పఠనం దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఆదిమ మానవుడు ఆధునిక మానవుడిగా ఎలా అభివృద్ధి చెందాడు అనే విషయాన్ని తెలుసుకోవడానికి గ్రంథాలయాలు ఉపయోగ పడతాయన్నారు. తదనంతరం వ్యాసరచన, వక్తృత్వ, చెస్, ఫ్యాన్సీడ్రెస్, పాటలు, క్విజ్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి అమీరుద్దీన్, జిల్లా ఆడిట్ అధికారి మంజుల, సీపీ బ్రౌన్ లైబ్రరీ సంచాలకులు పార్వతి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప జిల్లా వార్తలు

5

గురువారం 21 నవంబరు 2024



మాజీ సీఎం జగన్ చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మళ్లీ కదలిక వచ్చింది. రాజకీయ అజాతశత్రువుగా పేరొందిన వివేకాను ఆయన ఇంట్లోనే 2019 మార్చి 15న అత్యంత దారుణంగా హత్య చేశారు. ఈ హత్య తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపింది. సీబీఐ రాకతో కేసు రూపమే మారిపోయింది. ఈ కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డిని నిందితుడిగా చేర్చి సాక్ష్యాలను చూపడం కలకలం రేగింది. వివేకా హత్య కేసు ఆద్యంతం సంచలనాలకు కేంద్రబిందువుగా మారిపోయింది. కొద్ది రోజులు వేగం అయినా మళ్లీ స్లో అయింది. ఐదేళ్లు అయినా ఇంకా కేసు విచారణ పూర్తి కాలేదు. అయితే సుప్రీంకోర్టు ఎంపీ అవినాశ్‌రెడ్డికి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కొడుకు అయిన డాక్టర్ చైతన్యరెడ్డికి, వివేకా మాజీ పీఏ కృష్ణారెడ్డిలకు నోటీసులు ఇవ్వడం వైసీపీలో అలజడి పుట్టిస్తే.. మళ్లీ ఈకేసులో కదలిక వచ్చింది.





వివేకా హత్య కేసులో మళ్లీ కదలిక

● ఎంపీ అవినాశ్‌కు సుప్రీం నోటీసులు ● డాక్టర్ చైతన్యకూ చుట్టుకోనున్న కేసు

● వైసీపీలో అలజడి

(కడప-ఆంధ్రజ్యోతి): వివేకా కేసులో ఏ-8గా ఉన్న ఎంపీ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ వివేకా కుమార్తె సునీత సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. కడప సెంట్రల్ జైలులో వేరే కేసులో రిమాండ్‌లో ఉన్న దస్తగిరిని వివేకా హత్య కేసు నిందితుడు శంకర్‌రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి బెదిరించాడని.. ఈ నేపథ్యంలో అతడి బెయిల్ సైతం రద్దు చేయాలని ఆమె కోరారు. ఇక వివేకా మాజీ పీఏ కృష్ణారెడ్డి తమపై దాఖలు చేసిన ప్రైవేటు కేసు కొట్టేయాలని కోరుతూ సునీత, రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ రామ్‌సింగ్ సైతం మరో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో క్రిష్ణారెడ్డిపై దాఖలు చేసిన పిటిషన్‌కు సంబంధించి విచారణను ఫిబ్రవరి 24కు.. అవినాశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డిల బెయిల్ రద్దుచేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మార్చి 3కి కోర్టు వాయిదా వేసింది. ఇప్పుడీ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

దస్తగిరికి రూ.20 కోట్లు ఆఫర్..?

మళ్లీ చాలా రోజుల తర్వాత కేసులో కదలిక వచ్చిందని వివేకా అభిమానులు భావిస్తున్నారు. అయితే ఈ కేసు దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కొడుకు డాక్టర్ చైతన్యరెడ్డికి చుట్టుకునే అవకాశం ఉందంటూ చర్చ నడుస్తోంది. వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కొద్దిరోజులు కడప జైలులో, చంచల్‌గూడ జైలులో ఉన్నారు. అనంతరం బెయిల్‌పై విడుదల అయ్యారు. అయితే ఆయన కొడుకు చైతన్యరెడ్డి కడపలో డాక్టర్‌గా ఉన్నారు. గత ఏడాది ఓ కేసులో దస్తగిరి కడప సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. మెడికల్ క్యాంప్ పేరిట డాక్టర్ చైతన్యరెడ్డి అక్కడకు వచ్చి తనను బెదిరించాడని, ఆయన చెప్పినట్లు చెబితే రూ.20కోట్లు ఇస్తానంటూ ఆఫర్ చేశారని దస్తగిరి సంచలన ఆరోపణలు చేశారు. అప్పట్లో డాక్టర్ చైతన్యరెడ్డి ఈ ఆరోపణలను ఖండించారు. అవినాశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి బయట ఉండడం వల్ల సాక్షులను ప్రభావితం చేస్తారని, వారి బెయిల్ రద్దు చేయాలంటూ సునీత, రాజశేఖర్‌రెడ్డి కోరడంతో సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

మెడికల్ క్యాంప్ పేరుతో..

వైసీపీ హయాంలో కడప సెంట్రల్ జైలు కొందరికి అడ్డాగా మారిందనే ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో పనిచేస్తున్న జైలు అధికారులు వివేకా కేసులో నిందితులైన కొందరికి సకల సౌకర్యాలు కల్పించారంటారు. అందులో భాగంగానే మెడికల్ క్యాంప్ పేరిట డాక్టర్ చైతన్యరెడ్డి, ఇతరులకు అవకాశం కల్పించారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత వైసీపీ విధేయులైన కొందరు అధికారులపై ప్రభుత్వం వేటు వేసింది. అయితే వివేకా హత్య కేసు విచారణ స్లోగా జరగడంతో ఇది ఎప్పుడు పూర్తవుతుందో అనే అనుమానం ఉండేది. సుప్రీంకోర్టు ఎంపీ అవినాశ్‌రెడ్డికి నోటీసులు జారీ చేయడంతో ఒక్కసారిగా కదలిక వచ్చింది.

ఎందుకు అదుపులోకి తీసుకోలేదు

అధికారంలో ఉన్నప్పుడు సోషల్ మీడియాలో వైసీపీ అభిమానులు సభ్యసమాజం తలదించుకునేలా బూతు పోస్టులు చేశారు. దీనికి సంబంధించి ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. షర్మిల, విజయలక్ష్మి, సునీతపై ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి ఇచ్చిన కంటెంట్‌ను పోస్టు చేశానంటూ వర్రా రవీంద్రరెడ్డి పోలీసులకు తెలిపారు. ఇది పెద్ద దుమారం రేగింది. ఇప్పటికే వర్రా రవీంద్రరెడ్డిపై సునీత, షర్మిలలు తెలంగాణలో ఫిర్యాదు చేశారు. ఇక్కడ ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని డీఐజీ కోయ ప్రవీణ్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో బుధవారం కడపకు వచ్చిన షర్మిల ఎందుకు అవినాశ్‌రెడ్డిని అదుపులోకి తీసుకోలేదు, విచారించలేదంటూ ప్రశ్నించారు. సోషల్ మీడియా బూతు కంటెంట్ పోస్టులు, ఇతరత్రా వాటితో ఇప్పటికే తల్లడిల్లుతున్న జగన్ అండ్ కోకు వివేకా హత్య కేసులో నోటీసులు జారీ చేయడం కలకలంరేపుతోంది. ఈ విచారణ ఎలా సాగుతుందో, ఇందులో చైతన్యరెడ్డి పాత్రపై ఎలాంటి వాస్తవాలు బయటపడతాయోనని ఎదురుచూస్తున్నారు.

పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డి చేసిన అవినీతి అక్రమాలపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి కోరారు. బుధవారం శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ రాఘవరెడ్డి డీఈవోగా చాలాకాలం పనిచేశారని అప్పట్లోనే ఆయనపై ఆరోపణలు వచ్చాయన్నారు. అయినా వైసీపీ ప్రభుత్వం ఆయనకు ఆర్జేడీగా పదోన్నతి కల్పించిందన్నారు. ఆయన ఉపాధ్యాయులను ఇష్టానుసారం దూషించేవారని, విద్యార్థుల ముందే ఉపాధ్యాయులను అవమానకరంగా మాట్లాడేవారన్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ అనుమతులు లేకుండానే పనులు చేయడంతో పాటు ఇష్టానుసారంగా ఉపాధ్యాయుల బదిలీలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణాధికారి విచారణ చేపట్టగా ఆ సమయంలో కూడా ఫిర్యాదు చేసేందుకు వెళ్లినవారిపై గూండాలతో దాడి చేయించారన్నారు. కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ఇలాంటి అధికారులు విద్యావ్యవస్థలో కొనసాగేందుకు అనర్హులని, విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డి దురాగతాలపై 45రోజుల్లో దర్యాప్తు పూర్తిచేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన అక్రమాలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయని, ఇప్పటికే ప్రాథమిక విచారణ పూర్తయిందన్నారు. పలు అక్రమాలు నిర్ధారణ అయ్యాయని, 45రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి తప్పనిసరిగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ బదిలీ



డాక్టర్ సురేశ్వర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ ప్రాంగణంలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్‌రెడ్డి పాడేరుకు బదిలీ అయ్యారు. ఈయన ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రొఫెసరుగా విధులు నిర్వహిస్తూ సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్‌గా ఉండేవారు. ఈయన పాడేరుకు జనరల్ మెడిసిన్ ప్రొఫెసరుగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయనను వెంటనే పాడేరులో రిపోర్ట్ చేయవలసిందిగా బుధవారం ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్‌మణి ఆదేశించారు.

అవినాశ్ అనుచరులు నా కార్లు తీసుకున్నారు

● ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు

● నాకు న్యాయం చేయండి

● రంగారెడ్డి జిల్లాకు చెందిన బాధితుడి వేడుకోలు

● సోషల్ మీడియాలో వీడియో చక్కర్లు

7

నిబంధనలు పాటించని మద్యం దుకాణాల లైసెన్స్ రద్దు

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు

7



ఊరేగింపుగా వస్తున్న పీఠాధిపతి



నయనానందకరం.. ఉరుసు మహోత్సవం

కడప కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత అమీన్‌పీర్ దర్గా (పెద్దదర్గా) ఉరుసు మహోత్సవాలు నయనానందకరంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి భక్తు లు పెద్ద ఎత్తున హాజరు కావడంతో దర్గా పరిసరాలు కళకళలాడు తున్నాయి. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల వారు హాజరై దర్గాలో పూజలు చేస్తున్నారు. ఆ మేరకు సద్గురు మస్తాన్‌స్వామి తపస్సు చేసిన శేషాచల పర్వత ప్రాంత గుహ వద్దకు పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనితో పాటుగా ఫకీర్లు, భక్తులు, శిష్యులతో కలిసి వెళ్లి జెండా ప్రతిష్ఠించి చదివింపులు చేశారు. అనంతరం అక్కడి నుంచి ఊరేగింపుగా వాటర్ గండి వద్దకు చేరుకుని మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఉరుసు మహోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి 10గంటలకు హజరత్ మైఅల్లా దర్గా షరీఫ్ నుం చి పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా మొహమ్మ ద్ మొహమ్మదుల్ హుస్సేని పురవీధుల గుండా ఊరేగింపుగా ద ర్గా షరీఫ్‌నకు చేరుకుని చదివింపులు గావించారు. దర్గా ఆవరణ లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఖవ్వాలి పోటీలు అలరించాయి.





ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం

ఇంటిపన్ను వసూళ్లలో నిర్లక్ష్యం

● కోట్లకు చేరిన బకాయిలు

● పన్ను బకాయిలు రూ.9.30 కోట్లు

● కరెంటు పన్ను బకాయిలు రూ.11.39 కోట్లు

● వసూళ్లపై ప్రత్యేక చర్యలు ఏవీ?

మున్సిపాలిటీలో ప్రజలకు మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్, రోడ్లు, కాలువల సౌకర్యం కల్పించడంతో పాటు పారిశుధ్య నిర్వహణ చేపట్టడానికి నిధులు అవసరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే గ్రాంట్‌లే కాకుండా ప్రజల నుంచి ఇంటి, నీటిపన్నుల రూపేణ మున్సిపాలిటీ ఆదాయం సమకూర్చుకోవాల్సి ఉంటుంది. కానీ ఇంటి పన్నుల వసూళ్లలో ప్రొద్దుటూరు మున్సిపల్ రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. అంతేకాకుండా మొండి బకాయిలు పేరుకుపోయి మున్సిపల్ ఆదాయానికి తీవ్ర విఘాతం ఏర్పడుతోంది. దీంతో జనరల్ ఫండ్ సమృద్ధిగా లేక అభివృద్ధి పనులు చేపట్టడంలో వెనుకబడిపోయే పరిస్థితి ఏర్పడుతోంది.

ప్రొద్దుటూరు నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో మొత్తం 33,462 ఇంటి పన్నుల అసెస్‌మెంట్లు ఉన్నాయి. అలాగే ఖాళీ స్థలాల పన్నులు (వీఎల్‌టీ)కు సంబంధించిన అసెస్‌మెంట్లు 902 ఉన్నాయి. ఇంటి పన్నులు 2023-2024 ఆర్థిక సంవత్సరానికి రూ.10.50 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు రూ.1.20 కోట్లు మాత్రమే వసూళ్లు చేశారు. ఇంకా అరియర్స్ రూ.9.30 కోట్లు వసూలు కావాల్సి ఉంది. 2024-2025 కరెంట్ పన్ను డిమాండ్ రూ.20.77 కోట్లు. ఇందులో రూ.9.38 కోట్లు వసూళ్లయ్యాయి. ఇంకా రూ.11.39 కోట్లు వసూలు కావాల్సి ఉంది. వచ్చే ఏడాది మార్చి చివరి వరకు గడువు ఉన్నప్పటికి రూ.11.39 కోట్ల పన్నులు ఎప్పటికప్పుడు వసూళ్లు చేయకుంటే అరియర్స్ కింద పడిపోతాయి. ఇప్పటికే పన్ను బకాయిలు రూ.9.30 కోట్లు ఉన్నాయి. ఇందులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ భవనాలకు సంబంధించిన బకాయిలు కూడా ఉండటం విశేషం. మున్సిపల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ పెట్టి వసూళ్లు చేయకుంటే కోట్లరూపాయల పన్నులు పేరుకుపోతాయి.

పేరకుపోతున్న నీటి పన్ను బకాయిలు

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 23,500 నీటి కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. వీటికి సంబంధించి నీటి పన్ను బకాయిలు రూ.3.73 కోట్లు ఉండగా.. ఇందులో రూ.12.42 లక్షలు మాత్రమే వసూలయింది. అంటే బకాయిలు ఇంకా రూ.3.60 కోట్లు ఉన్నాయి. కరెంట్ నీటి పన్ను డిమాండ్ రూ.2.78 కోట్లు ఉంటే ఇందులో కేవలం రూ.95 లక్షలు మాత్రమే వసూలు చేశారు. నీటి పన్నులు వసూళ్లు చేయడంలో సైతం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

రెవెన్యూ నిర్లక్ష్యం

ఇంటి పన్నులు, నీటి పన్నులు వసూలు చేయడంలో రెవెన్యూ యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. ముఖ్యంగా 46 సచివాలయాలకు 46 మంది అడ్మిన్‌సెక్రటరీలు, రెవెన్యూ ఆర్వో, ఆర్ఐ ఇతర సిబ్బంది ఉన్నప్పటికి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చూపుతున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతోనే పన్నులు వసూళ్లు కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉనతాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పన్నులు వసూళ్లు చేయడంతో పాటు మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

ఇంటిపన్ను, నీటి పన్నుల బకాయిలు పేరుకుపోయిన మాట వాస్తవం. ఈ ఏడాది మార్చి నెల నాటికి ఎన్నికలు రావడంతో ఆ ననుల వలన పన్నుల వసూళ్లు సకాలంలో చేపట్టలేకపోయారు. దీంతో అరియర్స్ బకాయిలు పెరిగిపోయాయి. ఇంటిపన్ను నీటి పన్ను వసూళ్లకు ప్రత్యేక టీంలు వేసి చర్యలు తీసుకుంటాం. నీటిపన్ను చెల్లించకపోతే నీటికనెక్షన్ తొలగించేందుకు కూడా వెనుకాడం.

- మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు



యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

● 15 ట్రాక్టర్లు స్వాధీనం

● పోలీసుస్టేషన్‌లో డ్రైవర్ల ఆందోళన

6

● రీచ్ సిబ్బందితో వాగ్వాదం

రైతులకు పరిహారం చెల్లించండి

● రహదారిపై బాధితుల నిరసన

6

పందుల పట్టివేతలో ఉద్రిక్తత

● పందుల యజమానులు అడ్డుకుని..

● వాహన డ్రైవర్‌పై పెట్రోలుతో దాడి ● అప్రమత్తమైన పోలీసులు

జమ్మలమడుగు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉద్రిక్త నెలకొంది. పందులు పట్టేందుకు వచ్చిన వారిపై యజమానులు దాడికి దిగడంతో.. చివరకు పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. వివరాలు ఇలా..

జమ్మలమడుగు పట్టణంలోని పలు వీధుల్లో పందుల బెడద అధికంగా ఉన్న ప్రాంతాలకు వెళ్లి వాటిని పట్టాలని కమిషనర్ వెంకటరామిరెడ్డి వారి సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు వారం క్రితమే పందుల యజమానులకు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయాన్నే పులివెందుల ప్రాంతానికి చెందిన కొంతమంది పందులు పట్టే వారిని పిలిపించి జమ్మలమడుగులో పలుచోట్ల పందులను పట్టుకునే ప్రయత్నం చేశారు. దీంతో పందుల యజమానులు, మహిళలు రోడ్డుపై చేరి ముద్దనూరు రోడ్డులో వాహనంలోకి పందులను ఎక్కిస్తుండగా అడ్డుకుని డ్రైవర్‌పై పెట్రోలు పోసి తగులబెట్టే ప్రయత్నం చేశారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ వాహనం నుంచి దిగి పారిపోతుండగా పందుల యజమానులు, మహిళలు రాళ్లు రువ్వి డ్రైవర్‌ను గాయపరిచారు. దీంతో డ్రైనేజీ కాలువలో పడిపోయాడని స్థానికులు తెలిపారు. వెంటనే సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అయినా పందులను పట్టేవారిపై యజమానులు దాడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. డ్రైవర్ కోసం వెతకగా ఆయన కనిపించలేదు. పందులను పట్టేవారి వాహనం అద్దాలు ధ్వంసం కావడంతో మరో వాహనంలో వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు పట్టణంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. డ్రైవర్ ఎక్కడికి వెళ్లాడో తెలియాల్సి ఉంది. ఎస్ఐలు రామక్రిష్ణ, కల్పన, రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి, వారి సిబ్బంది పట్టణంలో ఎలాంటి గొడవ జరగకుండా పర్యవేక్షించారు.



ఆర్డీవో కార్యాలయం సమీపాన పందులు పట్టేవారిపై రాళ్లు రువ్వుతున్న మహిళలు




పోలీసుస్టేషన్ ఆవరణలో పందుల వాహనంతో పాటు సిబ్బంది




పందుల వాహనంపై పెట్రోలుతో దాడి.. అక్కడే పోలీసులు


లంకమల అందాలు చూడతరమా...



లంకమల అభయారణ్యంలో కనువిందు చేస్తున్న జలపాతం


- గలగల పారే సెలయేరు - బండరాళ్లపైనే అందమైన చెట్లు
- అబ్బురపరుస్తున్న పచ్చని కొండలు

రాజంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గంలోని సిద్దవటం పరిధిలోని లంకమల అభయారణ్యం చూపరులను కట్టిపడేస్తోంది. మండల కేంద్రానికి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో లంకమల అడవుల్లో నిత్యపూజకోన ఉంది. కార్తీక మాసం సందర్భంగా కడప, నెల్లూరు, అన్నమయ్య జిల్లావాసులు వేలాదిమంది ఈ అభయారణ్యానికి వచ్చి నిత్యపూజకోనను సందర్శిస్తుంటారు. నిత్యపూజకోనకు ఎంతో భక్తిగా వెళ్లే భక్తులు అభయారణ్యంలోని అందాలను ఆస్వాదిస్తున్నారు. 4 కిలోమీటర్ల మేర నడిచివెళ్లే ఈ మార్గంలో పెద్ద పెద్ద బండరాళ్లు, ఎత్తయిన కొండలు పచ్చదనం పరుచుకున్న గుట్టలు, లోయలు, భారీ వృక్షాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. భారీ వర్షాలు లేనప్పటికీ ఒక మోస్తరు వర్షం వల్ల నిత్యపూజకోన వద్ద గుండంలో పైనుంచి జలపాతంలా నీరు పడుతూ ఎంతో ఆకట్టుకుంటోంది. దారి వెంబడి చెట్ల వేర్లు ఊయల రూపంలో మారి అందరినీ కట్టిపడేస్తున్నాయి. కొండలపై ఉన్న బండరాళ్లు ఒక్కొక్కటి ఒక్కో ఆకృతిలో ఉంటూ చూడముచ్చటగొలుపుతున్నాయి. నిత్యపూజకోనకు వెళ్లే వేలాదిమంది భక్తులు ఇక్కడ అడవితల్లి అందాలను చూసి ఒకవైపు భక్తిభావంతో, మరోవైపు ప్రకృతి అందాలను చూసి తన్మయత్వం చెందుతున్నారు.


పచ్చదనంతో చూపరులను కట్టిపడేస్తున్న లంకమల అభయారణ్యం


రాళ్లను దాటుకుంటూ నిత్యపూజకోనకు వెళుతున్న భక్తులు


ఓ వైపు పచ్చదనం.. మరోవైపు మోడువారిన చెట్లు


లంకమలలో ఇలాంటి అందాలెన్నెన్నో...

ఆటోను ఢీకొన్న ఐచర్ వాహనం

- ఒకరి మృతి...
- 12 మందికి గాయాలు


ప్రమాద స్థలంలోనే మృతి చెందిన బాలక లక్ష్మీదేవి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చిన్నమండెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళుతున్న ఆటోను ఐషర్ వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా 12 మందికి గాయాలయ్యాయి, ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు మండలంలోని కలిబండకు చెందిన 12 మంది కూలీలు బెస్తపల్లిలో కూలి పనులకు వెళ్లారు. పని పూర్తి చేసుకుని సాయంత్రం ఆటోలో స్వగ్రామానికి వెళుతుండగా బెస్తపల్లి క్రాస్ సమీపంలోని డాబా వద్ద మదనపల్లి వైపు వెళుతున్న ఐషర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలక లక్ష్మీదేవి (48) అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన 12 మందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మృతి చెందిన లక్ష్మీదేవికి ఒక కుమారుడు ఉన్నాడు. భర్త దాదాపు పదేళ్ల క్రితం చనిపోయాడు. తమ గ్రామానికి చెందిన ఒకరు మృతి చెంది, 12 మంది గాయపడడంతో కలిబండలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు పరిహారం చెల్లించండి

రహదారిపై బాధితుల నిరసన


రోడ్డుపై నిరసన తెలుపుతున్న గ్రామస్థులు


బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ తపస్విని

కురబలకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి రోడ్ల విస్తరణకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని భూబాధితులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అంగళ్లు పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో పనులను అడ్డుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సర్వేనంబరు 130, 132లలో విలువైన భూములను కోల్పోయామని, దాదాపుగా పనులు పూర్తి కావస్తున్నా ఇప్పటి దాకా పరిహారం చెల్లించలేదన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కాంట్రాక్టర్ సిబ్బంది తమపై కేసులు పెడుతామని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనంతరం తహసీల్దార్ తపస్విని అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడి వచ్చే నెలాఖరులోగా నష్టపరిహారం అందిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కాగా ముదివేడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం, దిండుగల్లు జిల్లా, పెరియారుకోటకు చెందిన మారుముత్తు (33) మదనపల్లె పట్టణం దేవతానగర్‌లో కాపురం ఉంటున్నాడు. ఆదివారం సొంత పని నిమిత్తం వెళ్లి వస్తున్న అతను బైపాస్ వద్ద రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి వివాహమై ఆరునెలలు మాత్రమే అయింది. భార్య ఫిర్యాదు మేరకు మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రొద్దుటూరు ప్రభుత్వ ఖాజీగా ఆరిఫుల్లా

కలికిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ప్రభుత్వ ఖాజీగా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మహబూబ్‌బాషా కుమారుడు షేక్ ఆరిఫుల్లాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ప్రొద్దుటూరుకు మరో ఖాజీ కొనసాగుతున్న నేపథ్యంలో పట్టణ అవసరాల రీత్యా మరో ఖాజీని నియమిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కొత్తగా నియమితులైన ఆరిఫుల్లా పదేళ్లపాటు ఖాజీగా కొనసాగుతారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఖాజీగా బాధ్యతలు నిర్వహిస్తూ ముస్లిం వివాహాలను చట్టబద్ధంగా నిర్వహించాలని ప్రభుత్వం షరతులు విధించింది. చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని షరతు విధించారు.

భూమి కౌలుకు ఇస్తే కబ్జా చేశారు


వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

రామసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి కౌలుకు ఇస్తే కబ్జా చేశారని ఓ బాధితురాలు వాపోయింది. ఆమె వివరాల మేరకు.. మండలంలోని నారిగానిపల్లె పంచాయతీ ఎర్రనేలపల్లె గ్రామానికి చెందిన లక్ష్మమ్మ భర్త వెంకటరమణరాజుకు సర్వే నెంబరు 218/1సీ1లో 2.75 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని ఇదే గ్రామానికి చెందిన సురేంద్రరాజుకు కౌలుకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ భూమికి సంబంధించి కౌలుదారుడు దొడ్డిదారిన పట్టా రూపొందించుకున్నట్లు ఆమె ఆరోపించింది. ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. దీనిపై స్పందించిన కలెక్టర్ లక్ష్మమ్మ భూమిని కబ్జాదారుల నుంచి విడిపించి బాధిత మహిళకు అప్పగించాలని తహసీల్దార్ నిర్మలాదేవికి ఆదేశాలిచ్చారు. దీంతో బుధవారం రెవెన్యూ, పోలీసు సిబ్బందితో తహసీల్దార్ భూమిని పరిశీలించి సర్వే చేశారు. కబ్జాదారుల నుంచి భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. రికార్డులను తారుమారు చేసి భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నగల దుకాణాలపై అధికారుల దాడులు

- దుకాణాలలో బంగారు నిల్వలు.. అమ్మకాలపై రోజంతా తనిఖీలు
- అధికారుల రాకతో దుకాణాల మూత


బంగారు దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

బి.కొత్తకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలోని బంగారు దుకాణాలపై వాణిజ్య పన్నుల శాఖాధికారులు బుధవారం పెద్దఎత్తున దాడులు నిర్వహించారు. 15 మంది అధికారులు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో 5 దుకాణాల్లోకి ప్రవేశించి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. బుధవారం ఉదయం 11 నుంచి రాత్రి పొద్దుపోయే వరకు తనిఖీలు కొనసాగాయి. బి.కొత్తకోట పట్టణంలో దాదాపు 30 బంగారు దుకాణాలు ఉండగా, వీరు యూనియన్‌గా ఏర్పడి బంగారం కొనుగోలు, అమ్మకంపై తప్పుడు లెక్కలు చూపి ట్యాక్స్‌లు ఎగ్గొడుతున్నారని, నాణ్యతలేని బంగారాన్ని 22 క్యారెట్ బంగారం అని, హాల్‌మార్క్ అని కస్టమర్లను మోసగిస్తున్నారని, నగలు కొనుగోలు చేసిన వారికి తెల్లకాగితంలో జీఎస్టీ లేని బిల్లులు ఇష్టానుసారం వేసి, మోసగించి రూ.లక్షలు కొల్లగొడుతున్నారని ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కేవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రవిశంకర్, కడప, మదనపల్లె, రాయచోటి, పులివెందుల వాణిజ్యపన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్లు సునీత, మౌనిక, వరలక్ష్మి, జ్ఞానానందరెడ్డిలతో పాటు జీఎస్టీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఎంపిక చేసుకున్న 5 దుకాణాలలోకి వెళ్లి రికార్డులను, బిల్లులను స్వాధీనం చేసుకున్నారు. బంగారు నిల్వలు, రోజువారీ వాస్తవ విక్రయాలు, బయటి నుంచి బంగారం కొనుగోళ్లపై ఆరా తీశారు. అధికారుల తనిఖీల సమాచారంతో పట్టణంలోని మదనపల్లె రోడ్డు, బెంగళూరు రోడ్డులోని పలు దుకాణాలు మూసివేసి యజమానులు జారుకున్నారు. తాము వెళ్లిన షాపులలో మాత్రం అధికారులు క్షుణ్ణంగా రాత్రి వరకు తనిఖీలు చేస్తూనే ఉన్నారు. బంగారం ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారు. వాటి బిల్లులు, దుకాణాలలో రోజువారీ వ్యాపారం ఎంత? వీరు చూపిస్తున్నది ఎంత? బంగారు నగలు ఇస్తామంటూ చీటీల పేరుతో ప్రజల నుంచి రూ.కోట్లలో నగదు వసూళ్లపై విచారణ చేశారు. అయితే తనఖీలలో ఏ మేరకు అక్రమాలు గుర్తించారు, దుకాణాలపై వచ్చిన ఆరోపణలలో వాస్తవం ఎంత అనే విషయమై ఈ అధికారులు బయటకు వెల్లడించలేదు.

విక్రయాలపై ట్యాక్స్ చెల్లించాల్సిందే

కేవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ ట్యాక్స్


బంగారు విక్రయాలపై షాపు యజమానులు లక్షకు రూ.3 వేలు ట్యాక్స్ చెల్లించాల్సిందే. అలా లేనిపక్షంలో చర్యలు తీసుకుంటాం. అయితే బంగారు 22 క్యారెట్ వుందా లేదా, హాల్‌మార్క్, నాణ్యత తదితర విషయాలు తూనికలు కొలతల అధికారులు చూస్తారు. బంగారంపై చేస్తున్న లావాదేవీలు, కొనుగోళ్లు, అమ్మకాల బిల్లులు, మా కార్యాలయంలో ఉన్న వివరాలకు సరిపోతాయా లేదా అనేది వాణిజ్య పన్నులశాఖ అధికారులుగా మేం విచారిస్తాం.

ఉపాధి ద్వారా గోకులాలను పూర్తి చేయాలి


కలికిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు మంజూరైన గోకులాలను (పశువుల షెడ్లు) త్వరగా పూర్తి చేయాలని కలికిరి క్లస్టర్ డ్వామా ఏపీడీ శ్రీనివాసులు ఆదేశించారు. ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలస వెళ్లిన, లేదా చనిపోయిన కూలీల పేర్లను జాబ్ కార్డుల జాబితా నుంచి తొలగించాలన్నారు. అదే విధంగా కొత్తగా కార్డులు కోరే కూలీలకు వెంటనే జాబ్ కార్డులు జారీ చేయాలన్నారు. వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల నుంచి చదువుకున్న వారిని గుర్తించి వారికి ఉన్నతి కార్యక్రమం ద్వారా పారిశ్రామిక శిక్షణకు పంపాలని ఆదేశించారు. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో సుజాత, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- 15 ట్రాక్టర్లు స్వాధీనం
- పోలీసుస్టేషన్ ఎదుట డ్రైవర్ల ఆందోళన
- రీచ్ సిబ్బందితో వాగ్వాదం



పోలీసుస్టేషన్ వద్ద ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

ఒంటిమిట్ట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్జీపల్లి ఇసుకరీచ్ నుంచి పెద్దఎత్తున ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సచివాలయం నుంచి అనుమతి పొందిన వారికి మాత్రం రీచ్‌లోకి వెళ్లి ఇసుక తీసుకోవాలని నిబంధనలు ఉన్నా అందుకు విరుద్ధంగా ఎవరికి తోచిన రీతిలో వారు అక్రమంగా ఇసుకను తరలించుకుపోతున్నారు. రాత్రిపూట ఎక్స్‌కవేటర్ల సాయంతో టిప్పర్ల ద్వారా బయటకు తరలించడం, ఉదయం కూలీలతో ఎలాంటి బిల్లులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా తరలించేస్తున్నారు. వీటితో పాటు రీచ్‌కు దగ్గర ఉన్న గ్రామస్థులు మాకు ఇసుకలో పర్సెంటేజీ ఇవ్వాలని మంగళవారం రాత్రి పెద్దఎత్తున రాళ్లను రోడ్డుకు అడ్డం పెట్టి వాహనాలు వెళ్లకుండా ఆందోళన చేపట్టారు.

మా గ్రామం నుంచి తీసుకెళుతున్న ఇసుకకు తమకు మామూళ్లు చెల్లించాలని లేకుంటే ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వమని తేల్చి చెప్పారు. ఉదయం కడప నుంచి వెళ్లిన ట్రాక్టర్‌లు రీచ్‌లోకి వెళ్లకుండా అడ్డుపడడంతో స్థానిక ఎస్ఐ శివప్రసాద్ జోక్యం చేసుకుని రోడ్డుకు అడ్డం పెట్టిన కారు, రాళ్లు తొలగించాలని లేకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో వారు వెనక్కు తగ్గారు. ట్రాక్టర్లు వెళ్లిన మరికొద్దిసేపటికే ఇసుక రీచ్ సిబ్బంది ఎక్స్‌కవేటర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి తమకు తెలియకుండా నదిలోకి వెళ్లి ఇసుకను తరలిస్తున్నారని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పోలీసు అధికారులు నదిలో ఉన్న 15 ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి తహసీల్దార్ రమణమ్మకు అప్పజెప్పారు. ఇసుక క్వారీకి చెందిన సిబ్బంది వెంకటేశ్వర్లు తహసీల్దార్‌తో మాట్లాడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు రావడంతో అక్కడే ఉన్న ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు ఒక్కసారిగా ఆయనతో ఘర్షణకు దిగారు.

మా ట్రాక్టర్లను కావాలనే పోలీసులకు పట్టించారని, తాము 900 రూపాయలు నగదు ఇచ్చి ఇసుకను తీసుకెళుతున్నామని అప్పుడు లేని ఇబ్బంది ప్రస్తుతం ఎందుకు వచ్చిందని, తమను ఎందుకు పోలీసులకు పట్టించారని ప్రశ్నించారు. అనంతరం పోలిసుస్టేషన్ ఎదుట ట్రాక్టర్ డ్రైవర్లు ఆందోళనకు దిగారు. ఆ సమయంలో స్టేషన్‌లో రైటర్ సుబ్బరాజు ఒక్కరే ఉండడంతో పెద్దఎత్తున అరుపులు, కేకలతో పోలీసుస్టేషన్ హోరెత్తింది. వెంటనే సిబ్బందికి అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారిని స్టేషన్ నుంచి పంపించివేశారు.

ఉచిత ఇసుక అంటే తీసుకెళుతున్నాం...



మాకు నిబంధనలు తెలియవు. రోజు మాదిరిగానే వేకువజామున ఇసుకను తరలించేందుకు నదిలోకి వెళ్లాము. ప్రభుత్వం ఇసుక అంటేనే తీసుకెళుతున్నాము. అక్కడ కూలీలతో ఇసుకను నింపుకున్నాము. అనంతరం పోలీసులు వచ్చి ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. రోజు మా వద్ద డబ్బులు తీసుకుని ఇసుక లోడు చేసేవారు. అలాగే రోజువారీగా తరలించాం. ప్రభుత్వ నిబంధనల బోర్డు ఏర్పాటు చేసి ఎప్పటి నుంచి ఎప్పటివరకు అనే వివరాలను ఏర్పాటు చేయాలి.

- అంజనేయులు, ట్రాక్టర్ డ్రైవర్, కడప.

అవినాశ్ అనుచరులు నా కార్లు తీసుకున్నారు

● అవినాశ్‌రెడ్డి అనుచరులు నా కార్లు తీసుకున్నారు ● ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు ● నాకు న్యాయం చేయండి
● రంగారెడ్డి జిల్లాకు చెందిన బాధితుడి వేడుకోలు ● సోషల్ మీడియాలో వీడియో చక్కర్లు

కడప, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నా వాహనాలను కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరులు అద్దెకు అని తీసుకుని.. తిరిగి ఇవ్వకుండా ఇబ్బందుల పాలుచేస్తున్నారని తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. అందులో తెలిపిన మేరకు..
రంగారెడ్డిలో ట్రావెల్స్ నడుపుతుండేవాడినని సతీష్‌కుమార్ తెలిపారు. ఒక రోజు తెలంగాణ రాష్ట్రం వికారాబాద్‌కు చెందిన మణిరాజ్ వచ్చి నుంచి మూడు వాహనాలు బాడుగు ఇవ్వాలని కోరాడన్నారు. పులివెందుల మెడికల్ కళాశాల వద్ద ఈ వాహనాలను నడిపేందుకు రోజుకు రూ.1500 చొప్పున నెలకు రూ.45,000 బాడుగకు మాట్లాడుకున్నామన్నారు. అప్పటికే మణిరాజ్ అనేకమార్లు తనవద్ద వాహనాలను బాడుగకు తీసుకున్నాడన్నారు. ముందుగా మూడు వాహనాలను తీసుకెళ్లారన్నారు. తర్వాత మరో రెండు వాహనాలు తీసుకెళ్లారన్నారు. ఈ మేరకు రెండు మూడు నెలల పాటు వాహనాలకు సంబంధించిన బాడుగ కూడా చెల్లించారన్నారు. మణిరాజ్ తనవద్దకు వచ్చి కార్లు రిపేరు వచ్చాయని, ప్రస్తుతం బాడుగ కూడా ఇవ్వలేనని, రూ.2లక్షలు డబ్బు కావాలని అడిగారన్నారు. తన వాహనాలు అతనివద్ద ఉన్నాయి కదా అని రూ.2లక్షలు ఇచ్చానన్నారు.
అవినాశ్‌రెడ్డి అనుచరులైన పులివెందులకు చెందిన మహిళా ఎంపీటీసీ, వేంపల్లె జడ్పీటీసీ రవి, ప్రసాదరెడ్డి, శంకర్‌రెడ్డి తన వాహనాలను తీసుకెళ్లారన్నారు. బాడుగకు ఇచ్చిన కార్లు తిరిగిరాకపోవడంతో పాటు తీసుకెళ్లిన వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారన్నారు. దీంతో తాను 2022లో పులివెందుల వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసి తనకు సహాయం కావాలని కోరానన్నారు. దీంతో కార్లు ఎక్కడున్నాయో గుర్తించారన్నారు. కానీ పోలీసులు ఉన్నతాధికారులు లేరని, వారికి చెప్పి ఇస్తామని చెప్పారన్నారు. అయితే పథకం ప్రకారం శంకర్‌రెడ్డి, ప్రసాదరెడ్డి తనకు కాల్ చేసి కార్లు ఇస్తామని రమ్మని చెప్పారన్నారు. తాను అక్కడకు వెళ్లగానే ఇడుపులపాయలోని ఒక భవనంలోకి తీసుకెళ్లి అక్కడ ఇష్టమొచ్చినట్లు కొట్టి, తిట్టి చంపేస్తామని బెదిరించారన్నారు. ప్రసాదరెడ్డి, శంకర్‌రెడ్డిలు వేరేవారికి ఫోన్ చేసి ఇతను చెప్పినా వినడం లేదని, ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నాడని, ఇతనికి ఏదైనా తాపించి బిల్డింగ్ నుంచి తోసేస్తే ఆత్మహత్య కింద పోతుందని వాళ్లు మాట్లాడుకున్నారన్నారు. దీనిని గమనించిన తాను తన మిత్రునికి ఫోన్ చేసి కారు తీసుకురమ్మని చెప్పానన్నారు. తన స్నేహితులు వచ్చిన తర్వాత ఎలాగోలా అక్కడ నుంచి తప్పించుకున్నానన్నారు. ఎంపీటీసీ మహిళ అయినప్పటికి తనను ఇష్టమొచ్చినట్లు దుర్భాషలాడిందన్నారు. పులివెందుల పోలీసులు వైసీపీ నాయకుల చెప్పుచేతల్లోనే పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం మారినా అక్కడ మాత్రం కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన అనుచరులైన శంకర్‌రెడ్డి మాటే చెల్లుతోందన్నారు. 2022లో కేసు పెట్టినప్పుడు పోలీసులు తనకు ఎలాంటి సహకారం అందించలేదన్నారు. తాను ఏమి అడిగినా ఎంపీ అవినాశ్‌రెడ్డి పేరు వినిపించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లను ఒకటే కోరుతున్నా.. నాకు న్యాయం చేయండి అన్నారు. తనకు ఇప్పటికి బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు.


రంగారెడ్డి జిల్లాకు చెందిన బాధితుడు సతీశ్‌కుమార్

సోషల్ మీడియాలో వైరల్

ఈ వీడియో సోషల్ మీడియాలో తిరుగుతోంది. ఇటీవలే మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో కదలిక వచ్చింది. అలాగే సోషల్ మీడియాలో బూతు పోస్టులు పెడుతుండడంతో ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రరెడ్డిని అరెస్టు చేశారు. మరికొందరి కోసం వేట కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ వీడియో చక్కర్లు కొట్టడంతో వైసీపీ నేతలు కలవరపడుతున్నారు. అయితే తెలంగాణలో అద్దెకు తెచ్చిన వాహనాలను పులివెందుల, వేంపల్లెలో తాకట్టుపెట్టారు. అలా పెట్టిన వాహనాలను వేంపల్లెకు చెందిన వైసీపీ నేతలు తక్కువ డబ్బుతో తాకట్టు నుంచి తీసుకున్నారు. ఆ వాహనాలలో తిరిగేవారు. అయితే అసలు ఓనర్లు ఇక్కడకు వచ్చి ఇక్కడున్న వాహనాలను తీసుకెళ్లారు. సతీశ్‌కుమార్ అనే వ్యక్తి ఇంకా మూడు కార్లు ఉన్నాయని, పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా గంగిరెడ్డి, పద్మలత


గంగిరెడ్డి, పద్మలత, శివప్రసాద్, విలియంరాజ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కడప ఎంఈఓ గంగిరెడ్డి, మైదుకూరు ఎంఈఓ పద్మలత ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం కడప కలెక్టరేట్ సభా భవనంలో జరిగిన సమావేశానంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. జిల్లా కోశాధికారిగా ఎర్రగుంట్ల ఎంఈఓ ఈఎల్ బీఎస్ శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా అట్లూరు ఎంఈఓ విలియంరాజ్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు కార్యదర్శులు, మిగతా కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలి : జేసీ


చెన్నారెడ్డిపేట వద్ద రైతులతో మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

పోరుమామిళ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమరావతి-బెంగుళూరు జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జాయింటు కలెక్టరు అదితిసింగ్ అధికారులను ఆదేశిం చారు. బుధవారం ఆమె పోరుమామిళ్ల మండలంలోని బొప్పాపురం, చెన్నారెడ్డిపేట, పేరమ్మగారిపల్లె, బ్రహ్మంగారిమఠం మండలంలోని ముదు మాల, వెంకటాపురం ప్రాంతాల్లో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. కొందరు రైతులు ప్రభుత్వం అందించే నష్టపరిహారం తమకు సరిపోదని, మరింత పెం చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూమి కోల్పోయిన అర్హులైన రైతుల వివరాలను సేకరించి నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రమోహన్, పోరుమామిళ్ల తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గండిలో టెండర్లు ఖరారు

చక్రాయపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వివిధ రకాల వాటికి టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించారు. దేవస్థానంలో నిర్వహించే వివాహాలు, ఇతర శుభ కార్యక్రమాలకు పందిళ్లు, ఎలక్ట్రికల్ డెకరే షన్లు, పూల డెకరేషన్లు, సామాన్లు సప్లై చేసుకునేందుకు ఏడాదికి వేంప ల్లెకు చెందిన సురేష్ బాబు రూ.1,01,116కు పాట దక్కించుకున్నారు. దేవస్థానం ఆవరణలో భక్తులు పాదరక్షలు భద్రపరచుకునేందుకు ఇడుపుల పాయకు చెందిన వెంకటా చలపతి రూ.45వేలకు వేలం దక్కించుకున్నారు. స్వామివారి అలంకరణకు గ్రామోత్సవానికి పూలు, పూలమాలలు టెండర్ నిర్వహించగా.. ముగ్గురు పోటీపడి టెండర్లు వేశారు. అనివార్య కారణాలతో టెండర్లను రద్దు చేసి వాయిదా వేశారు. నిత్యాన్నదాన పథకానికి అరటి ఆకులు సప్లై చేసేం దుకు, దేవాలయంలో పర్వదినాల్లో మామిడి, అరటి తోరణాలు సరఫరా చేసేం దుకు తదితర పాట దక్కించుకున్నారు. కడప దేవదాయ ధర్మాదాయశాఖ జూనియర్ అసిస్టెంట్ విజయభారతి, ఆలయ ఛైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి, దేవస్థాన ప్రధాన అర్చకులు కేసరి, బ్యాంకు అధికారులు, పోలీసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారి హుండీ ఆదాయం రూ.23లక్షలు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి ఆల యంలో బుధవారం హుండీలను లెక్కించగా రూ.23,04,108 ఆదాయం వచ్చి నట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. గత మూడు నెలల కాలంలో భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను పూర్వపు మఠాధిపతి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో లెక్కించగా రూ.23,04,108 నగదు, 8 గ్రాముల బంగారు, 280 గ్రాములు వెండి వచ్చినట్లు తెలిపారు.

నిబంధనలు పాటించని మద్యం దుకాణాల లైసెన్సు రద్దు

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

ప్రొద్దుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటి ంచని మద్యం దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని.. బెల్టు షాపులను ఉపేక్షించమని ఉమ్మడి కడప జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ హెచ్చరించారు. బుధవారం ఆయన ప్రొద్దు టూరు విచ్చేశారు. లింగాపురం వద్ద వున్న లిక్కర్‌డిపోను పరిశీలించి సరుకుల నిల్వలపై ఆరా తీశారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని విజిజ్ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యం షాపుల్లో అక్కడే తాగడానికి అనుమతి లేదని.. అలా తాపే మద్యం దుకాణాలపై చర్యలు తప్పవన్నారు. బెల్టు షాపులపై నిరంతర నిఘా పెట్టామన్నారు. ఇప్పటికే జిల్లాలో అనేక ప్రాంతాల్లో కేసులు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా కొందరు మద్యం దుకాణాల నిర్వాహకులు డిపో మేనేజర్‌పై ఫిర్యాదు చేశారు. డిపో మేనేజర్ కొందరికి ఎక్కువ సరుకును ఇస్తూ మరికొందరికి తక్కువ సరుకు ఇస్తున్నాడని ఆరోపించారు. దీనిపై డిప్యూటి కమిషనర్ స్పందిస్తూ మద్యం తక్కువ ఎక్కువ ఇవ్వరాదని.. అందరికి సమానంగా మద్యం సరఫరా చేస్తారని తెలిపారు.


లిక్కర్ గౌడౌన్‌లో స్టాకును పరిశీలిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

అక్రమ మద్యం, నాటుసారా తయారీ, అమ్మకంపై నిరంతర దాడులు

పులివెందుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ మద్యం, నాటుసారా తయారీ, అమ్మకంపై నిరంతర దాడులు కొనసాగిస్తామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి (డీపీఈఓ) ఎస్.రవికుమార్ అన్నారు. బుధవారం పులివెందుల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చక్రాయపేట మండలం కల్లూరుపల్లె తండా లో ఎక్సైజ్ అధికారులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పాత నేరు స్తులు, అనుమానితులు, గ్రామస్తుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. నాటుసారాతో కలిగే దుష్ప్రభావాలు, పౌరుల భవిష్యత్తుపై ఎలా ప్రభావం చూపుతుందో వివరించారు. నేరస్తు లు, అనుమానితులను బైండోవర్ చేసి నాటుసారా నిర్మూలిస్తా మని తెలిపారు. పులివెందుల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చెన్నారెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, చక్రాయపేట ఎస్ఐ కృష్ణ య్య, సిబ్బంది పాల్గొన్నారు.


కల్లూరుపల్లెలో కార్డన్ సెర్చ్ చేస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి : కలెక్టర్

కడప కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ చెరు కూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని గ్రీవెన్స్‌హాల్లో బుధవారం వైద్యులతో కలెక్టర్ సమీక్షిస్తూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని... ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలన్నారు. జిల్లాలోని 51 ప్రాథమిక ఆసు పత్రుల్లో వైద్యాధికారులు రాబోయే మూడు నెలలకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. వచ్చే సమావేశంలో పీపీటీ ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రస్తుత స్టేటస్, ఓపీ, ఐపీ, డెలివరీ, ఇమ్యూనైజేషన్ వంటి రోజు వారి డేటాను పొందుపరచాలన్నారు. వైద్యాధికారులు లక్ష్యాలను సాధించేందుకు కష్టపడి పని చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అన్ని ప్రాథమిక, అర్బన్ హెల్త్ సెంటర్లలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించిందని.. అధికారులు నిబద్ధతతో పనిచే యాలన్నారు. వైద్యాధికారులు పనిచేసే ప్రాంతాల్లో నివాసాలు ఉండాలని ఆదేశించారు. మాతాశిశు మరణాల సంఖ్యను తగ్గించ డం, 104 వాహనాల షెడ్యూల్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు, తదితర ఆరోగ్య సేవలపై అధికారులకు సూచనలు జారీ చేశారు. ఐపీ, ఓపీ, ల్యాబ్, డెలివరీ వంటి ఆరోగ్య సేవల్లో రాష్ట్ర స్థాయిలో 'ఏ' గ్రేడ్ ర్యాంకింగ్‌లో జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. ప్రతిభ చూపుతున్న వైద్యాధికారులను కలెక్టర్ అభినందించారు. డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, డీఐఓ హిమదేవి, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ బాలాంజనేయులు, వైద్యాధికా రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

పీజీఆర్ఎస్ నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించడం, ప్రజలకు అర్జీల అవసరం రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరే ట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక, కంట్రోల్ రూమ్ అనుబంధ అధికారులతో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, కేఎంసీ కమి షనరు మనోజ్‌రెడ్డి, కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి సురేష్ కుమార్, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

గొంతుకోసుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



కమలాపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని బాలికల గురుకుల పాఠశాలలో జూనియర్ ఇంటర్ విద్యార్థిని కౌసల్య తరగతి గదిలో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నిం చింది. గమనించిన ఉపాధ్యాయులు వెంటనే చికిత్స నిమిత్తం స్థాని క ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రిన్సిపాల్ తులశమ్మ సమాచా రం మేరకు.. బుధవారం మధ్యాహ్నం తోటి విద్యార్థినులతో కలిసి భోజనం చేసేందుకు కౌసల్య డైనింగ్ హాలుకు వెళ్లింది. భోజనం చేయకుండానే వెనుదిరిగి తరగతి గదికి వెళ్లి చిన్న అద్దాన్ని పగల గొట్టుకుని ఆముక్కతో గొంతు కోసుకుని స్పృహ తప్పి పడిపో యింది. వెంటనే ఉపాధ్యాయులు గమనిండంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. విద్యార్థినిది రాజంపేట అని ఆమె తలి దండ్రులు కువైట్‌లో ఉన్నారన్నారు. విద్యార్థినికి చదువు మీద ఆసక్తి లేదని.. ఇటీవల ఆమె నానమ్మ పాఠశాలలో వదిలి వెళ్లడం తో ఇలా చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. ఈ విష యంపై విద్యార్థిని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. ఎలాంటి ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారని ప్రిన్సి పాల్ పేర్కొన్నారు. కాగా, విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

● ఇద్దరు నిందితుల అరెస్ట్

బద్వేలుటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఘర్ష ణలో గాయపడ్డ మృతికి కారణమైన ఇద్దరు నింది తులను అరెస్ట్ చేసినట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు. నెల్లూరు జిల్లా మర్రి పాడు మండలం చాబోలు గ్రామానికి చెందిన మంచాల వెంక టయ్య(38)పై గొడుగునూరు క్రిష్ణ, చెప్పలి దినేష్ అనే ఇరు వురు రెండు నెలల్రకితం దాడి చేయడంతో చికిత్స పొందు తూ మృతి చెందాడు. ఈ క్రమంలో నిందితులను బుధవారం బద్వేలు ఆర్టీసీ బస్టాండు వద్ద అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. మృతుడు వెంకటయ్య చెల్లెలు, భర్త గొడుగునూరు క్రిష్ణలు కుటుంబకలహాలతో విడిపో యారు. ఈ క్రమంలో రెండవ నిందితుడు అయిన చెప్పలి దినేష్ తన అమ్మతో వెంకటయ్య చనువుగా ఉన్నాడనే అను మానంతో సహించలేకపోయాడు. ఈనేపథ్యంలో పథకం ప్రకారం గొడుగునూరు క్రిష్ణ, చెప్పలి దినేష్‌లు ఆగస్టు 13వ తేదీ అబుసాయిపేట గ్రామంలో కత్తితో దాడి చేయడంతో వెంకటయ్యకు గాయాల య్యాయి. వెంకటయ్యను వెంటనే కడప, నెల్లూరు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. అతని చనిపోవడానికి కారణమైన గొడుగునూరు క్రిష్ణ, చెప్పలి దినేష్‌లను బుధవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

వైసీపీ నేతపై చీటింగ్ కేసు నమోదు

కడప క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ప్రైవేటు కాలేజీ విక్రయానికి సంబంధించి రూ.30లక్షలు తీసు కుని మోసం చేసిన వైసీపీ నేతపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. వైసీపీ నేత సుభాన్‌బాషా కడపకు చెందిన డాక్టర్ నజీము ద్దీన్‌కు వికాస్ కళాశాలను విక్రయిస్తున్నట్లు అగ్రిమెంటు రాసి చ్చాడు. ఆసమయంలో నజీముద్దీన్ నుంచి రూ.30లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత కళాశాలకు యూనివర్శిటీ అను మతి లేదని తెలిసి.. నజీముద్దీన్ తమ డబ్బులు వెనక్కు ఇవ్వాలని కోరాడు. అయితే సుభాన్‌బాషా డబ్బులు ఇవ్వక పోవగా.. బెదిరించడంతో నజీముద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు సుభాన్‌బాషాపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



బ్రహ్మంగారిమఠం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాణిబావి సమీ పంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బి.కో డూరు మండలం తుమ్మల పల్లెకు చెందిన ఎ.నారాయణ, తన బంధువు పరమేశ్వర రోజువారి పనుల నిమిత్తం మైదుకూరు పట్ట ణానికి వెళ్లారు. పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రా మానికి వస్తుండగా రాణిబావి సమీపంలోని టోల్‌గేటు దగ్గర ఎదు రుగా వస్తున్న లారీని అదుపు తప్పి ఢీకొన్నారు. దీంతో నారాయణ (52) అక్కడికక్కడే మృతి చెందాడు. పరమేశ్వర్‌కు తీవ్రగా యాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి బ్రహ్మ ంగారిమఠం ఎస్ఐ చంద్రశేఖర్ చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణ పంచాయతీల లక్ష్యాలను నెరవేర్చాలి



సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ

సికెదిన్నె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీల లక్ష్యాలను నెరవేర్చాలని డీపీఓ రాజ్యలక్ష్మి తెలిపారు. చింతకొమ్మదిన్నె పంచాయతీ, తిప్పిరెడ్డిపల్లె పంచాయతీ, పాపాసాహెబ్‌పేట పంచాయతీల్లో స్వర్ణపంచాయతీ సర్వేలను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ సర్వేలు పక్కాగా తయారు చేసి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేరేందుకు కార్యదర్శులు డేటాను అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంటి పన్ను, నాన్ ట్యాక్స్ పరిశీలించి కార్యదర్శులు స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో రెండు రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. ఈఓఆర్‌డీ సుబ్బారెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్‌కు నివాళులర్పించిన షర్మిల



వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ షర్మిల

వేంపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద ఆయన తనయ, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నివాళులర్పించారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో మంగళవారం రాత్రి ఇడుపులపాయలో బస చేసిన షర్మిల బుధవారం ఉదయం విశ్రాంతి భవనం నుంచి వైఎస్సార్ ఘాట్ చేరుకున్నారు. వైఎస్ సమాధిపై పూలమాల వేసి నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఘాట్ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి మొక్కుకున్నారు. కాంగ్రెస్ నేతలు ధ్రువకుమార్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బాలం సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

చిత్రం చెప్పిన సమస్య



మండల కేంద్రం చెన్నూరులో కొత్తరోడ్డులోని లక్ష్మీనగర్, సరస్వతీనగర్, కొత్తగాంధీ నగర్, యానాదికాలనీ, రాజులకాలనీ, బుడ్డాయపల్లె, కుమ్మరకాలనీ, పెద్దచర్చి ప్రాంతాల నడుమ నెలలుగా నీరు చేరి మురికిగా మారింది. కేసీ కెనాల్‌కు ఆయకట్టుగా ఉన్న ఈ ప్రాంతం లోతట్టుగా ఉండడంతో పై ప్రాంతం నుంచి వచ్చే నీరు చేరి నిల్వ ఉంటోంది. ఈ నీరే తగ్గు ప్రాంతంలోని పంటపొలాలకు వెళ్లాల్సిఉంది. అయితే నీటి పారుదలకు మార్గం పూడిపోవడంతో ఈ సమస్య నెలకొంది. దీంతో చివరికి దుర్గంధ భరితంగా మారింది. నెలల కొద్దీ నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధిచెంది స్థానికులకు వివిధ రకాల జ్వరాలు వస్తున్నాయి. ఏటా పంట సమయాల్లో ఇలాంటి పరిస్థితే ఎదురవుతోంది. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

-చెన్నూరు, (ఆంధ్రజ్యోతి)

జీఎన్ఎస్ఎస్ నుంచి నీళ్లు ఇవ్వండి

హాస్టళ్ల మరమ్మతులకు కోటి రూపాయలు : మండలిలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

వేంపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని ప్రాంతాలను సమానంగా చూస్తున్నారని, చెప్పిన మేరకు గతంలో పులివెందుల నియోజకవర్గంలో పైడిపాళెంకు కృష్ణాజలాలు ఇచ్చారని, మళ్లీ గాలేరు నగరి కాల్వ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా చక్రాయపేట మండలం కాలేటివాగు వరకు నీళ్లు ఇస్తే ఆ ప్రాంతంలో సాగు, తాగు నీటి సమస్య తీరుతుందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఓ పెద్ద కాంట్రాక్టర్ గాలేరు నగరి నుంచి కాలేటివాగు, వెలిగల్లు, తంబళ్లపల్లె వరకు ఎత్తిపోతల పథకం పనులు రూ.5000కోట్లకు పైగా అంచనాతో పనులు చేపట్టారన్నారు. ఇప్పటికి రూ.1100కోట్లు ఖర్చుచేసినా ఎక్కడా ఒక్క ఎకరాకు నీరిచ్చిన పరిస్థితి లేదన్నారు. పని అంచనా విలువను పెంచుకున్నారని, ఇంజనీర్లే కాంట్రాక్టర్లుగా మారి నిధులు దుర్వినియోగం చేశారని, సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. పులివెందుల నియోజకవర్గంలో చక్రాయపేట మండలం వెనుకబడిన ప్రాంతమని సాగు,తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని, ప్రస్తుతం నిలిచిపోయిన పనుల్లో కాలేటివాగు వరకు పూర్తిచేసి నీళ్లు ఇస్తే నియోజకవర్గానికి చంద్రబాబు రెండోసారి నీళ్లు ఇచ్చినవారు అవుతారన్నారు. ఇందుకు రూ.250కోట్లు ఖర్చు అవుతుందన్నారు. హాస్టళ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, రిపేర్లు చేయాల్సి ఉందని, వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని కోరగా మంత్రి బాలవీరాంజనేయ పులివెందులలో హాస్టళ్ల మరమ్మత్తుకు కోటి రూపాయలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. జగన్ సొంత నియోజకవర్గాన్ని పట్టించుకోకున్నా మేము నిధులు ఇస్తున్నామని మంత్రి ప్రకటించారు.

డ్రైనేజీ నిర్మాణం పనులతో వ్యాపారాలు నిల్

ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కమాల్‌బాష

కడప మారుతీనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ బస్టాండ్ వద్ద డ్రైనేజీ నిర్మాణం పనులతో నెల రోజులుగా వ్యాపారం సాగలేదని అద్దె విషయంలో మినహాయింపు ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ షేక్ కమాల్‌బాష డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ అద్దె గదుల వద్ద చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద నెల రోజులుగా డ్రైనేజి నిర్మాణం చేపడుతున్నారు. దీంతో బస్టాండ్‌లోనికి వెళ్లే అవకాశం లేదు. ఫలితంగా ఆర్టీసీ స్థలాల్లో అద్దె ప్రాతిపదికన పొందిన వ్యాపార సముదాయాల్లో వ్యాపారం నడవక వెలవెల బోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బస్సుల రాకపోకలకే ఉన్న దారి కూడా ప్రస్తుతం వర్షపు నీరు చేరి మురికి నీటి కుంటలా తయారైందన్నారు. దీంతో వ్యాపార సముదాయాలు పూర్తిగా వెలవెలబోతున్నాయన్నారు. డ్రైనేజీ నిర్మాణం కారణంగా అద్దె చెల్లింపును కుదించి చెల్లించేలా వెసులుబాటు కల్పించాలని కోరారు. కడప ఆర్టీసీ బస్టాండ్ అద్దెగదుల యజమానులు బాబూయాదవ్, కె. ప్రవీణ్ కుమార్, ఆరిఫ్ అలీఖాన్, జోసెఫ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

'విద్యావ్యవస్థలో ప్రయోగాలు చేయకూడదు'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోజుకొక కొత్త నిబంధనలు తెస్తూ పాఠశాలల్లో ప్రయోగాలు చేయడంతో విద్యావ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద పాఠశాలల్లో సమయాన్ని మారుస్తూ అధికారులు ఉత్తర్వులు ఇవ్వడం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. గత ఐదేళ్లలో పాలకుల అనాలోచితకారణాలతో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని రకరకాల సవరణలు తెచ్చి విద్యావ్యవస్థలో ప్రయోగాలు చేయడంతో విద్యార్థుల అభ్యసనా స్థాయి తీవ్రంగా పడిపోతోందన్నారు. తక్షణం ప్రభుత్వం పునరాలోచించి పాఠశాలల సమయం పెంపుదలను ఉపసంహరించుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

పీఈటీపై చర్యలు తీసుకోవాలని ఆందోళన



ప్రిన్సిపాల్‌తో వాగ్వాదం చేస్తున్న తల్లిదండ్రులు

కమలాపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల పాఠశాల పీఈటీ చంద్రకళావతిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థిని అను తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని అనును పీఈటీ కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ నెల 18న కేర్ టేకర్ అనును లీడరుగా నియమించి ఇంటర్ విద్యార్థులు అరటిపండు తొక్కలు డస్ట్‌బిన్‌లో వేసేలా చూడాలని పంపింది. అయితే పీఈటీ ఇంటర్ విద్యార్థుల వద్ద నీకేం పని నీవెందుకు అక్కడ ఉన్నావని కొట్టడంతో చెయ్యికి గాజు గుచ్చుకుని నొప్పిపట్టింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గంగాదేవి, బ్రహ్మయ్య బుధవారం పాఠశాలకు చేరుకుని ఎందుకు మాకు సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొట్టే అధికారం మీకెవరిచ్చారని పీఈటీని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులతో వాగ్వావాదానికి దిగారు. విద్యార్థిని విలేకరులతో మాట్లాడుతూ పీఈటీ టీచర్ వీపుపై మూడు సార్లు గుద్దిందని మరోసారి చెంపపై కొడుతుండగా నేను చెయ్యి అడ్డుపడడంతో గాజు నా చెయ్యికి తగులుకుని గాయమైందని, చెయ్యి నొప్పిగా ఉందని వివరించింది. ప్రిన్సిపాల్ తులశమ్మ మాట్లాడుతూ చెత్తో చిన్నగా కొట్టడంతో గాజు తగులుకుని బాలికకు గాయమైందన్నారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించామన్నారు. పీఈటీకి మెమో ఇస్తామన్నారు. తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ పీఈటీ చంద్రకళావతిని తాండూరులోని గురుకుల పాఠశాలకు బదిలీ చేస్తే ఇక్కడికి డిప్యుటేషన్‌పై వచ్చారన్నారు. ఆమెపై గతంలో కూడా అనేక ఆరోపణలు ఉన్నాయని ఆమె డిప్యుటేషన్‌ను రద్దు చేసి ఉన్నతాధికారులు ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


కడప ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి అన్నారు. వైవీయూలో కంప్యూటర్ సైన్స్ ఎన్ఎస్ఎస్ పీఓ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. పిచ్చిమొక్కలు తొలగించి రహదారిపై గుంతలను మట్టితో కప్పారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఇటువంటి సేవాభావం కలిగి ఉండడం ద్వారా మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వలంటీర్లు పాల్గొన్నారు.

వేడుకగా అయ్యప్ప గ్రామోత్సవం

సింహాద్రిపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి మాలధారులు(స్వాములు) కదం తొక్కుతూ పురవీధుల్లో గ్రామోత్సవం వేడుకగా నిర్వహించారు. ప్రత్యేక రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి బాజాభజంత్రీలు, డీజే పాటలతో ప్రత్యేక కోలాట బృందాలు ఏర్పాటు చేసి ఊరేగించారు. సింహాద్రిపురం మణికంఠేశ్వర స్వామి దేవస్థానం 4వ వార్షికోత్సవంలో భాగంగా అయ్యప్ప స్వామి మండల పూజను నిర్వహించారు. తెల్లవారుఝాము నుంచీ స్వామివారికి అభిషేకము, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.







సాగులో ముందస్తు చర్యలు తీసుకోవాలి



శనగ పంటను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ

పులివెందుల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో ముందస్తు చర్యలు తీసుకోవాలని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ అన్నారు. బుధవారం ఇనగలూరు, తుమ్మలపల్లె, కృష్ణంగారిపల్లెల్లో పర్యటించారు. శనగ, చీనీ రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. చీనీలో మొక్క మొదలు దగ్గర తేమ లేకుండా చూసి విరివిగా పచ్చిరొట్ట ఎరువులు వాడాలన్నారు. మొదల్లవద్ద బంక కారుటకు బోర్డో మిశ్రమ పూత పూసి, ఉధృతిని తగ్గించాలని తెలిపారు. చీనీలో పొలుసు పురుగు నివారణకు ముందుగా మొక్క మొదలు భాగాన్ని గోనెసంచితో తుడిసి ఎరడు బాగా తడిసేలా 0.4మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బీమా చేయించుకోవాలి : ఏఓ

పులివెందుల టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని పులివెందుల మండల వ్యవసాయాధికారి నాగలక్ష్మి సూచించారు. అచ్చవెల్లి, రాగిమానుపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోందిలో ప్రకృతి వ్యవసాయాధికారి భాస్కర్‌రెడ్డితో కలిసి ఆమె శనగ పంటను సందర్శించారు. కార్యక్రమంలో పులివెందుల ఏఓ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దురాళ్లపై జగన్ పేరు తొలగింపు



రాళ్లపై అక్షరాలు తొలగిస్తున్న దృశ్యం

లింగాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగనన్న భూరక్ష-2020 భూరీసర్వేలో భాగంగా రైతుల పొలాల సరిహద్దుల్లో పాతిన రాళ్లపై ఉన్న జగనన్న భూరక్ష 2020- అనే అక్షరాళ్లను పూర్తిగా చెరిపివేశామని తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. నరసింహరావుపల్లె, హిరోజిపురంలో రీసర్వే పూర్తి అయి సరిహద్దు రాళ్లను పాతారని తెలిపారు. బుధవారం సరిహద్దు రాళ్లపై ఉన్న అక్షరాలను పూర్తిగా తొలగించామన్నారు. కార్యక్రమలో అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం : టీడీపీ




సభ్యత్వం చూపుతున్న శ్రీనివాసరెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యలను పరిష్కస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. కడప నగరం అశోక్‌నగర్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో అశోక్‌నగర్ వాసులు ఆయనకు సమస్యలు విన్నవించుకున్నారు. టీడీపీ సభ్యత్వం పొందిన వారికి రెండేళ్లు ఐదు లక్షల విలువైన ప్రమాదబీమా ఉంటుందన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

కలెక్టరేట్ ఉద్యోగులకు సభ్యత్వం

కడప కలెక్టరేట్, నవంబరు20(ఆంధ్రజ్యోతి) కలెక్టరేట్ ఉద్యోగులకు ఏపీ ఎన్జీఓ ఉద్యోగ సంఘ సభ్యత్వం అందించారు. సంఘ నగర అధ్యక్షుడు కంభం చిన్నయ్య ఆధ్వర్యంలో నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అధికారులందరూ పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీఓ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్ర, నగర కార్యదర్శి శైలేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బాదుల్లా, నాగిరెడ్డి, సాల్మన్, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



విజేతలతో ప్రిన్సిపాల్ యోగాంజనేయులు, అధ్యాపకులు

వేంపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వేంపల్లె డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. పలు పోటీల్లో ప్రతిభావంతులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మాధవరావు, అధ్యాపకులు బాలకొండ గంగాధర్, నాగలక్ష్మి, మల్లేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాఖాగ్రంథాలయంలో...

పెండ్లిమర్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభావంతులకు బహుమతులు పంపిణీ చేశారు. విజేతలకు హై స్కూల్ హెచ్ఎం కళావతి బహుమతులు అందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయాధికారి మల్లేష్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మేథాశక్తి పెరుగుతుంది

చక్రాయపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలను చదవడంతో మేధాశక్తి పెరుగుతుందని ఎస్ఐ కృష్ణయ్య, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం రామాంజులు, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గౌస్ ప్యారీ అన్నారు. విద్యార్థి దశ నుంచి మంచి విషయాలు తెలుసుకునేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు. పుస్తకాలు, దినపత్రికలు చదవడం ద్వారా మేధాశక్తి పెరుగుతుందన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● **వేముల**, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిసినట్లు లైబ్రేరియన్ గంగాధర్ యాదవ్ తెలిపారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు ప్రభాకర్, సావిత్రి, చాంద్‌బాష, పాఠకులు పాల్గొన్నారు.

● **సికెదిన్నె**, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రమాదేవి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలు ముగింపులో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈఓఆర్‌డీ సుబ్బారెడ్డి, వైద్యాధికారి రాఘవేంద్ర, హోమియోపతి వైద్యులు షాకీర్‌హుస్సేన్, ఏపీఓ రామాంజులరెడ్డి, గ్రంథాలయ అధికారి ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

● ***లింగాల***, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతోనే జ్ఞానసముపార్జన సాధ్యం అవుతుందని ఎంఈఓ రామకృష్ణయ్య అన్నారు. ఇప్పట్ల గురుకుల కళాశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో ఆయన మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సత్యవతమ్మ, గ్రంథాలయ ఇన్‌చార్జి మాధవి, గ్రంథాలయాధికారి జయమ్మ, వికలాంగుల విద్యా సహాయకులు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కరించండి

ఆర్డీవో సాయిశ్రీకి పలువురు వినతి పత్రాలు అందజేత

జమ్మలమడుగు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో పలు ప్రాంతాల్లో భూములు, స్థలాలకు సంబంధించి ఆక్రమణలు జరిగాయని, బెదిరిస్తున్నారని పలు సమస్యలపై ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందజేశారు. అందులో రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రొద్దుటూరు పట్టణం వెంకటాద్రినగర్, కాలువ కట్ట సమీపాన 427 సర్వే నంబరులో ప్రభుత్వ స్థలంలో దాదాపు 300 కుటుంబాల వారు ఇళ్లు కట్టుకుని నివాసాలు ఉన్నారు. అక్కడక్కడ కొందరు ఇళ్లను నిర్మించుకున్నారు. కరెంటు స్తంభాలు అక్కడ ఉన్నాయని, మిగిలిన స్థలాల్లో సైతం రాళ్లు, సిమెంటు, స్తంభాలు ఏర్పాటు చేసుకుని వాటిని కొందరు అగ్రవర్ణాలవారు ధ్వంసం చేశారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ తదితరులు తెలిపారు. సంబంధిత అధికారులు వెంచర్లు వేసిన యజమానులతో చేతులు కలిపి వారివైపే మాట్లాడుతున్నారని తెలిపారు. అక్కడ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ కులవివక్షకు కూడా పాల్పడుతున్నారని వెంటనే విచారించి 427 సర్వే నంబరు పొలాన్ని పరిశీలించాలని వారు కోరారు. అలాగే చాపాడు మండలం చీపాడు గ్రామానికి చెందిన ఇద్దరు వృద్ధులు భార్య, భర్త కలిసి ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందించారు. తమకు ఉన్న పొలాన్ని అల్లుడు రాయించుకున్నాడని, తమకు సీనియర్ సిటిజన్ చట్టం కింద కేసు నమోదు చేసి ఆ పొలాన్ని తిరిగి ఇప్పించాలని కోరారు. ముద్దనూరు మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో వార్డెన్ మనోహర్ విధులకు హాజరు కావడంలేదని, మెనూ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

జమ్మలమడుగు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో ఈనెల 14వ తేదీ నుంచి 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయి. బుధవారం సాయంత్రం ముగింపు కార్యక్రమంలో భాగంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ముఖ్యఅతిథి డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ పుస్తకాలు చదవడంతో మానసిక వికాసం పెంపొందుతుందన్నారు. పుస్తక పఠనం వలన ఎంతో మంది గొప్ప వ్యక్తులుగా మారి సమాజానికి సేవ చేశారన్నారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా టాలెంట్ టెస్ట్, వ్యాసరచన , క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులు ప్రథమ బహుమతి కేవీ తపశ్వనిరెడ్డి (బాలాజీ హైస్కూలు), ద్వితీయ బహుమతి ఎస్.శశాంక్ (జాన్స్ హైస్కూలు), తృతీయ బహుమతి ఎల్.వసంత్ (జడ్పీ హైస్కూలు, ఈడిగపేట), సాయినిఖిల్ (గీతాంజలి హైస్కూలు) విజేతలుగా నిలిచారు. వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరు అందించండి

● ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మైదుకూరు ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అసెంబ్లీ సమావేశాల్లో మాటాడారు. విజయవాడలోని అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రజా సమస్యలపై బుధవారం నాలుగో సారి ఆయన మాట్లాడారు.

సాగుకు పనికిరాని భూమిలో మొక్కల పెంపకం

బి.కోడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాగుకు పనికిరాని భూమిలో మొక్కల పెంపకం చేపట్టాలని ఎంపీడీవో భాస్కర్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సాగుకు అనుకూలంగా లేని భూమిలో అంతరించిపోతున్న వివిధ రకాల వృక్షజాతుల పెంపకం కోసం ఏర్పాటు చేసిన మండలస్థాయి ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 35 గ్రామాల ప్రతినిధులు హాజరయ్యారు.ఈ సమావేశంలో ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ జిల్లా క్లస్టర్ కోఆర్డినేటర్ జి.లావణ్య మాట్లాడుతూ ఉమ్మడి వనరుల ఆవశ్యకత గురించి చర్చించి నీటి భద్రత, ఆహార భద్రత, పశుగ్రాస భద్రత, ఆర్థిక భద్రత, సామాజిక భద్రత కోసం ఉమ్మడి భూమిలో మట్టి, నీటి సంరక్షణపనులు ఎంతో ఆవశ్యకత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఈసీ ఖాజా, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న నీరు



బద్వేలు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజుపాలెం చెరువు నిండి బద్వేలు - కడప ప్రధాన రహదారిపై నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. చెరువు నిండి అలుగుపై ప్రవహించకుండా అడ్డంకులు ఉండడంతో చెరువునీరంతా ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువు నీటిని అలుగుపై పారే విధంగా చర్యలు చేపడితే పంటపొలాలపై, ప్రధాన రహదారిపై కానీ చెరువు నీరు ప్రవహించదని తెలిపారు.

ఎగువరామాపురంలో పొలం పిలుస్తోంది

కలసపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎగువరామాపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం కింద ఈ సంవత్సరం రబీ నుంచి దరఖాస్తు చేసుకుని ప్రీమియం కామన్ సర్వీసు సెంటరులో చెల్లించాలని ఏవో ఎస్.జాకీర్‌షరీఫ్ తెలిపారు. అన్ని నోటిఫైడ్ పంటలకు ప్రీమియం చెల్లించే చివరి తేదీ డిసెంబరు 15 అని వరి పంటకు మాత్రమే డిసెంబరు 31 అన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు 1బీ, ఆధార్, బ్యాంకు పాస్‌పుస్తకం, పంట సాగుపత్రం తీసుకువెళ్లాలన్నారు. పీఎంఎఫ్‌బీవై ప్రీమియం చెల్లించిన రైతులు పంట నమోదు కూడా చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సహాయవ్యవసాయ సంచాలకుడు ఎం.మురళీధర్‌రెడ్డి, డీఆర్‌సీ ఏవో శైలజ, హార్టికల్చర్ అధికారి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి నారాయణాచార్యుల గ్రేడ్-1 గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డు ప్రిన్సిపాల్ పద్మనాభరెడ్డి ఉచితంగా పుస్తకాల ర్యాక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రచయితలు డీకే చదువులబాబు, జింకా సుబ్రహ్మణ్యం, రిటైర్డు హెడ్మాస్టర్ గోపీనాథరెడ్డి, ఆర్టీపీపీ ఇంజనీరు ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, గ్రంథాలయ అధికారి తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ఉచిత ఇసుకకు నిబంధనలు పాటించాలి

జమ్మలమడుగు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక విధానానికి సంబంధించి నిబంధనలు పాటించాలని రశీదులు లేకుండా తరలిస్తే ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేస్తామని జమ్మలమడుగు తహసీల్దారు శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉచితంగా ఇసుక మంజూరు చేస్తూ 18.10.2024 ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. స్థానికంగా ఉన్న తమ సిబ్బందికి డ్యూటీలు వేశామన్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజలు స్థానిక అవసరాలకు మాత్రమే ఉచిత ఇసుక పథకానికి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవాలన్నారు. అలాగే సమీప గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇసుకకోసం బుకింగ్‌చేస్తే రశీదు ఇస్తారన్నారు. ఆ రశీదును తీసుకుని గ్రామ పరిధిలో తమ సిబ్బంది డ్యూటీలో ఉన్న మహిళాపోలీసులు, వెల్ఫేర్ వారికి ఇవ్వాలన్నారు. కూలీలతోకానీ, సొంతంగా ఎద్దుల బండి, లేక ట్రాక్టర్‌లో ఉచిత ఇసుకను నింపుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ రశీదు కేవలం 24గంటలు మాత్రమే అమలులో ఉంటుందన్నారు. తదుపరి అవసరాన్ని బట్టి అవసరమైన వారు ఇసుక బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. మోరగుడి, కన్నెలూరు, పొన్నతోట, అంబవరం, గొరిగెనూరు, ధర్మాపురం, దానవులపాడు, దేవగుడి, సున్నపురాళ్లపల్లె, పెద్దదండ్లూరు, సుగుమంచిపల్లె, జమ్మలమడుగులోని కోటవీధి, మొత్తం 12 పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనలు పాటించి ఉచిత ఇసుకను ప్రజలు పొందాలని తహసీల్దారు తెలిపారు.



ఉపాధి పనుల్లో
అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు
అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరత్నమ్మ

మైలవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథక పనుల్లో అవకతవకలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని వారిపై చర్యలు తప్పవని అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరత్నమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఉపాధి హామీ పనులపై తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రామలింగేశ్వరరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఉపాధి హామీ ఏపీవోలు ప్రసాదు, లక్ష్మీనారాయణ, సోషల్ ఆడిట్ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండండి
కేసీకెనాల్ డీఈ చిన్నపుల్లయ్య

దువ్వూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కేసీకెనాల్ డీఈ చిన్నపుల్లయ్య అన్నారు. దువ్వూరులోని కేసీ కెనాల్ బంగ్లాలో బుధవారం స్థానిక ఏఈ పవన్‌కుమార్‌రెడ్డి, ఇడమడక ఏఈ జమాల్, సీనియర్ అసిస్టెంట్ అన్వర్‌బాషతో సమావేశం అయ్యారు. నీటి సంఘాల ఎన్నికల విషయంలో ముందుజాగ్రత్తగా ఏర్పాట్ల విషయంలో సిద్ధంగా ఉండాలన్నారు. కేసీ ఆయకట్టు పరిధిలో సాగైన పంటల గురించి అడిగి తెలుసుకున్నారు.

వడ్డీ లేకుండా
ఇంటి పన్నులు చెల్లించవచ్చు

ఎర్రగుంట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లనగరపంచాయతీలో 2024-2025 రెండో ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చునని నగరపంచాయతీ కమిషనర్ శేషఫణి తెలిపారు. ఇంటి పన్నులు, ఖాళీ జాగా పన్నులు, నీటి పన్నులు తక్షణమే చెల్లించి నగరపంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.

సీఎం చంద్రబాబును కలిసిన లింగారెడ్డి



ప్రొద్దుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి సీఎం చంద్రబాబును బుధవారం విజయవాడలో కలిశారుఈ సందర్భంగా ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. అలాగే నామినేటెడ్ పదవుల్లో పార్టీకోసం పనిచేసిన క్యాడర్‌కు తనకు న్యాయం చేయాలని చంద్రబాబును విజ్ఞప్తి చేశారు.

ఆధార్‌సెంటర్లు పెంచి ఇబ్బందులు తీర్చాలి

పోరుమామిళ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ సెంటర్లను పెంచి ప్రజల ఇబ్బందులు తీర్చాలని సీపీఐ ఏరియా సహాయకార్యదర్శి పిడుగు మస్తాన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ల పంచాయతీలో ఒకే ఆధార్ సెంటరు ఉన్నందు వల్ల అది ఎప్పుడు పనిచేస్తుందో అర్థం కాక విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారన్నారు. కనీసం మీసేవా కేంద్రాల్లో అయినా పర్మినెంటు ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.



PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram finance ltd Mydukur branch issues the following notice to the general public. My client intend to grant loan to Smt. Shaik Shamshad Begham, W/o Shaik Akbar Basha r/o at D/no-7/3737 Srinivasa Nagar, Proddatur, YSR Kadapa district by mortgage. As such if anyone has any claims ,objections charges or mortgages sale agreements , court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5 days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTIES :** Kadapa District, Duvvuru Sub-District, Chinthakunta Grama Panchayat, Chinthakunta village, Chinthakunta village fields, SY.No. 643/1,644/1 An extent of 10.0 cents or 484.0 Sq Yards with in the following boundaries : East : ASSET OF YADALLA RAMAKRISHNA,PALURU ASHOK KUMAR, West : PANTA KALUVA, North : PANTA KALUVA, South :SITE OF PEERLA MAHABOOB BASHA.

G.PARAMESWARA KUMAR
ADVOCATE,PRODDATUR

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram finance ltd Proddatur branch issues the following notice to the general public. My client intend to grant loan to Smt. PANDITI RAJAMANI, W/o PANDITI SAAMELU residing at D/no-1/2 Sunnapuralla palli, Jammalamadugu, YSR Kadapa district by mortgage. As such if anyone has any claims ,objections charges or mortgages sale agreements , court attachments court disputes etc. shall be informed to the address mentioned below in within 5 days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTIES :** Kadapa District,Proddatur Sub-District, Proddatur Mandal, Gopavaram Panchayath, Proddatur village fields, SY.No-171-2B ,Ward no-4,Plot No-3 In Aarathi-2,Dwaraka nagar area An extent of 5.0 cents or 242.0 Sq Yards with in the following boundaries : East: LAND OF OTHERS, West : 30 FEET WIDE JOINT RASTHA, North : PLOT NO-4 South:PLOT NO-2.

G.PARAMESWARA KUMAR
ADVOCATE,PRODDATUR

PUBLIC NOTICE

Under the instruction my client M/s Shriram Finance Ltd., Badvel Branch, rep. by its Manager, the public is nodified as follows : Sri **Yerragolla Gopala Swamy** S/o **Chinna Krishnaiah**, r/o D.No. 19, Vidya Nagar, Badvel, YSR Kadapa Dt. has applied for loan to our firm and after going through documents of her right over the below mentioned property, my client-firm decided to grant loan to her. If anybody has got any righ/possession and title over the property or if any litigation is pending in any Court of Law, it shall be brought to the notice of my client, with documentary proof, within A Week from the date of this notice, failing which my client will disburse the loan amount. Any objections received after five days, they will not be taken into account. **Schedule of Properties :** Kadapa Dt. Badvel Sub-Dt, Badvel Municipal Area, Chennampalli Village Fields, SY.No. 309, an extent of 9.0 cents or 435.6 Sq. Yards with in the following **Boundaries :** East - Sy. No. 589 Land of Bala Subbaiah, West - Sy.No. 328, Land of Reddy Vari Narayana, North - Sarkar Road, South - Sy.No. 310 land of Reddyvari Narayana.

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL

PUBLIC NOTICE

Under the instruction my client M/s Shriram Finance Ltd., Porumamilla Branch, rep. by its Manager, the public is nodified as follows : **Gogu Ramadevi** W/o **Pothuraju Rajesh d/o Parandhamaiah** r/o D.No. 11-3-186, Kota Street, Badvel Town,YSR Kadapa Dt. has applied for loan to our firm and after going through documents of her right over the below mentioned property, my client-firm decided to grant loan to her. If anybody has got any righ/possession and title over the property or if any litigation is pending in any Court of Law, it shall be brought to the notice of my client, with documentary proof, within A Week from the date of this notice, failing which my client will disburse the loan amount. Any objections received after five days, they will not be taken into account. **Particulars of Property :** Kadapa Dt. Badvel Sub-Dt, Badvel Mandal, Badvel Village fields, Kota Street, SY.No. 1189 house site bearing Ac. 0.03 cent sand 220 Sq. Links located near house bearing door no. 11-2-35 **Boundaries :** East - Vacant site of Jyothaiagari Prasanna, South - Municipal Road, West - Vacant Site of Gunnamanthu Ramanaiah and Yakkaluri Venkateswarlu, North - Site of Sanakathula Pitchaiah, **Measurement of Site** : East - West : 30.6 feet or 9.32 Mtrs., North - South : 46 feet or 14.00 Mts. totalling to 155.88 Sq. yards in which constructed with all easement rights.

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL

